


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 అక్టోబరు, 2013 సంచిక : 5

(విజయ నామ సం॥, భాద్రపద మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారధ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | రూ॥ | 6/- |
| వార్షిక చందా | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | రూ॥ | 600/- |



**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.
**Ph : 9440413455, 9848133565**
Website : www.saidhamam.org
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి ........ 2
ఎందుకీ భ్రష్టత్వం ........ 5
మాతృసంస్థ కబుర్లు ........ 8
దీపం ఎందుకు? ........ 10
అవధూతలు ........ 13
షిరిడీ (కపర్డే) డైరీ ........ 19
శ్రీ సాయి సేవ ........ 21
అతడెప్పుడు వస్తాడంటే........ 23
స్వరాంజలి ........ 28
సాయితో తర్ఖడ్ స్మృతులు-5 ........ 29
అనాదిగా యీ గడ్డపైని నీతి ........ 32








# మా వాణి



ప్రియ పాఠకమిత్రులందరికీ,

విజయదశమి శుభాకాంక్షలు. గత గురువారంనాటి ఉదయం ఒక మిత్రుడు ఫోన్ చేసి “సాయి సచ్చరిత్రను గురించి ఒకరు నోటికి వచ్చినట్లు అవాకులూ, చెవాకులూ మాట్లాడారు. వారు పదిరకాల గ్రంథాలను గురించి ఉపన్యసించేవారూ, శాస్త్ర పాండిత్యం, పురాణాదికాలు, అవలోడనం చేసినవారూనూ. అందుచేత విన్నవారు ఆయన మాటలు శిలాక్షరాలుగా తీసుకొనే ప్రమాదమూ ఉంది. పైగా యివన్నీ గతంలో ఒక సాయి దేవాలయంలో వారం రోజుల ప్రవచనంలోనూ, ఆ తరువాత చెప్పినవి.

సాయి సచ్చరిత్ర వ్రాసిన వారూ, పారాయణ చేసిన వారు కూడా పాపాన కొట్టుకుపోతారని వారు తీర్మానం చేసారు ఏకంగా. అందులో బీజాక్షరాలు లేవట. సుదాముని కథ ఏ గ్రంథంలోనూ సచ్చరిత్రలో ఉన్నట్లు లేదట. ఆయనను గర్బదరిద్రుడనటం తప్పట. ఇలా అనటం ఎంత వరకు సబబు!” అని అడిగారు. నిజమే -

“వెర్రివాడి పెళ్లాం వాడకల్లా వదిన” అన్నట్లు ఇలాటి దురహంకారపూరితమైన వ్యాఖ్యానాలకు జవాబు చెప్పకపోవటం మరికొందరిక్కూడా అలుసిస్తుంది. బాబా వారి చరిత్ర ఎప్పుడో వేల ఏళ్లనాటిది కాదు. ఎన్నో రచనలు వచ్చాయి దీనిపై. వాటన్నింటిలోనూ గొప్ప అథారిటీ హేమాడ్‌పంత్ రచించిన సచ్చరిత్రేననటం నిర్ద్వంద్వం. అయితే అందులో కూడా తరువాత కాలంలో ప్రక్షిప్తాలు ఒకటో రెండో ఉన్నాయి తప్ప ఎక్కడా అభూతకల్పనలు లేవు. భగవద్గీతను వేలాది సంవత్సరాలుగా లక్షలాదిమంది జనం నిత్యపారాయణ చేస్తున్నారు. మన వారు రామాయణం, హిందీవారు రామచరిత మానస్ నిత్యపారాయణ చేయనిదే గంగముట్టనివారు

కోకొల్లలుగా నేటికీ ఉన్నారు. విష్ణు సహస్రనామాలు, లలితా సహస్రాలు, సౌందర్య లహరులు వగైరాలన్నీ పారాయణ చెయ్యబడుతూనే ఉంటాయి. గురుచరిత్ర సాయి సచ్చరిత్ర కూడా ఆ కోవలోనివే. సాయిసచ్చరిత్ర కేవలం మహిమలు ప్రధానంగా ఉన్నది కాదు-బోధ, ఆచరణ ప్రధానంగా ఉన్నట్టిది. అది చదవగా చదవగా అందులోని ఒక్కొక్క అంశమూ మనకు తెలియ కుండానే మన హృదయాల్లోకి, జీవితాల్లోకి చొచ్చుకు వస్తాయి. అటుపై మునుపటి వ్యక్తిత్వాలలోని లోపాలన్నీ సరికావటంతో-పూర్తి క్రొత్త వ్యక్తులుగా కన్పించే సాయిభక్తులెం దరో ఉన్నారు. ఆ విషయం పారాయణ చెయ్యని వారికి చెప్తే అర్థంకాదు. తేనె రుచి నాలుకపై వేసుకుంటే గదా తెలిసేది!

బీజాక్షరాలు, మంత్రాలు వగైరాలకు అనంతశక్తి ఉంది. నిజమే. కానీ, సద్గురువు బోధకు అంతకుమించిన శక్తి ఉన్నది. అది మన ఆలోచనలను అదుపు చేసి అమృతమయం చేయగలదు. సచ్చరిత్రలో అనవసరమైన వాగాడంబరాలు, ఆకర్షణలు లేకపోవచ్చుగానీ సరళసుందరమై, హృద యాంతరాళాలలోకి చొచ్చుకుపోగల చక్కని బోధలున్నాయి. అవసరమైన పుడు ఇవి కప్పీ ఝళిపించాయి కూడా. (పరులను నిందించినవాడు అశుద్ధాన్ని తినే పంది వంటివాడనటం యిలాటి వాటిలో ఒకటి.) ఇవి కష్టాలను తీరుస్తాయనీ, కామ్యాలను (కోరినవి)ఇస్తాయనీ మాత్రమే పారాయణ చేస్తున్నారనటం పొరపాటు. ఆదిలో అలాగే ప్రారంభం కావచ్చు. కానీ క్రమంగా లక్ష్యం మారుతుంది. భగవద్గీతాకారుడైన భగవంతుడే ఒప్పకొన్నాడు-"అర్థీ, ఆర్తుడూ, జిజ్ఞాసువూ, ముముక్షువూ-నలుగురూ నా భక్తులే" అని. అలాంటప్పడు అర్థార్థులను, ఆర్తులను కాదనే హక్కు మన కెక్కడిది? తల్లి బిడ్డ శరీరానికి తగిలిన గాయం ముందు మాన్పి, ఆ తరు వాత అదెందుకు తగిలిందో- మరోసారి అలాకాకుండా ఏం చేయాలో వివరిస్తుంది. సచ్చరిత్ర మాత కూడా తొలుత లౌకిక ప్రయోజనాలు తీర్చి, అలా తీరుస్తూనే మరెన్నడూ ఏ కోరికా కోరని స్థాయికి తీసుకువెడుతుంది మనను. ఇది అక్షర సత్యం.





సుదాముడు కుచేలుడిగా మారటం వెనుక గల కారణం గురించి సచ్చరిత్రలో ఉన్నట్లుగా అదే కథ నేను అరవై ఏళ్ల క్రితమే హరికథగా విన్నాను. అప్పటికి సచ్చరిత్ర ప్రచారంలోకే రాలేదు. భగవంతుని వాటా భగవంతుని కివ్వకుండా-దొరికిన మొత్తం తానే అనుభవించాలనుకోవటం మహా ర్దోషం. చుట్టూ వారితో పంచుకొనే తినాలని ఈశావాస్యోపనిషత్తు నిర్దేశిం చింది. ఆ విషయాన్నే యీ కథ సూచిస్తున్నది. భాగవతం సంస్కృతం లోనేకాక అనేకానేక భాషలలోకి వచ్చింది. కొన్నింట కుచేల కథ యిలా కూడా ఉండవచ్చు. ఆయన నిర్ద్వం ద్వంగా "దరిద్రపీడితుడు, కృశీభూతాం గుడు, జీర్ణాంబరుడు" అని భాగవతం చెప్తున్నది. పట్టెడోరముబెట్టుమని పత్రభాజన ధృతపాణు"లై బిడ్డలు వస్తే పెట్టలేకపోతున్నానని ఆయన భార్య దుఃఖించిందనీ ఉన్నది. సరే-యిది ప్రక్కనబెడితే -

సాయి సచ్చరిత్రలో శాస్త్రీయ విషయాలు లేవన్నది మరో వాదం. మహా భక్తుడు ధూర్జటి కవీంద్రుడు "ఏ వేదంబు పఠించెలూత?" అని ప్రశ్నించాడు శ్రీ రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, మళయాళస్వాముల వారు-వీరెవరూ శాస్త్రాలు, వేదాలు చదివి జ్ఞానులు కాలేదు. యోగులయ్యాక తెలుసుకొన్నారు అవన్నీ. ఆధ్యాత్మికత వేరు-శాస్త్ర జ్ఞానం, పురాణజ్ఞానం వేరు. వాటి ద్వారా ఆధ్యాత్మికత పరిపక్వం కాదు. కేవలం వాచా వేదాంతం రావచ్చునేమో! కానీ ఆధ్యాత్మిక సాధకులకు-వారు పరిపూర్ణస్థాయికి చేరేకొద్దీ శాస్త్రాదికాలన్నీ అలవోకగా కరతలామలకాలవుతాయి. పది పురాణాలు చదివి వాటిని పదుగురికీ ఆకర్షణీయంగా చెప్పటం వేరు-తద్వారా కీర్తి, ధనం ఆర్జించటం వేరు-ఆ శాస్త్రాలు అందించే లోతులను అవగాహన చేసుకొని హృదయంలో నిక్షిప్తం చేసుకోవటం వేరు. ఆధ్యాత్మిక వేత్తలు, మహాయోగులను విమర్శించడానికే శాస్త్రజ్ఞానం చాలనప్పడు-స్వయం పరమాత్ముడైన సాయినాథులవారిని, త్రిమూర్తి స్వరూపుడిగా ఎన్నోసార్లు ఋజువు చేసుకొన్న ఆ పరమ కరుణాళుడిని విమర్శించడానికి పురాణ కౌశలం చాలదుగాక చాలదు. అది ఆకాశం మీదికి ఉమ్మి

వేయబూనుకోవ టమే అవుతుంది.

అలా వాచాలత్వం చూపిన వారికంటే దాన్ని సహించి ప్రాచుర్యం కల్పించిన దేవాలయం వారిది యింకా పెద్ద తప్పు. వారు తాము నమ్మిన(?) దైవదూషణను, వారి చరిత్ర దూషణను వీనులారా విని, ఆమోదించి ఊరుకొన్నారు. గురునిందను, దైవనిందను విని తిరస్కరించకుండా ఊరుకొన్న దోషానికి లోనైనారు. ఇప్పటికైనా వారు తమ దేవాలయానికి సాయికి అచ్చపు భక్తులనే ఆహ్వానించుకొంటూ ఉంటే మంచిదేమో! ఆలోచించండి.

## ఎందుకీ భ్రష్టత్వం?

– శ్రీ డేవిడ్ ఫ్రాలే, అమెరికా

పశ్చిమ దేశాల ప్రభావంలో పడిన హిందువులు సాధారణంగా తాము హిందూ వంశాల నుంచి వచ్చామనే వాస్తవాన్ని కప్పిపెట్టాలని ప్రయత్నిస్తుంటారు. మత విషయాలలో తమ విశ్వజనీన భావాలను ప్రదర్శించటానికై చర్చిలకు, మసీదులకు పోతారు కాని దేవాలయాలకు పోతూ యితరులకు కనిపించటం వారికి నచ్చదు. ఫీజీలోను, బంగ్లాదేశ్, పాకిస్తాన్ లేదా మలేషియా వంటి ఇస్లామిక్ దేశాలలో హిందువులకు జరుగుతున్న అవమానాలు, అరబ్ దేశాలలో పనిచేసే హిందువులు బహిరంగంగా తమ మతాచారాలను పాటించే అనుమతి లేకపోవటం వంటి హిందూ సామాజిక సమస్యలను వారు ఎంతమాత్రం పట్టించుకోరు. కానీ, తమ మానవతావాదాన్ని, విశ్వప్రేమను నిరూపించుకోవటానికై పాలస్తానీయుల హక్కులకు తమ సమర్ధన తెలుపుతారు.

ఇలాంటి పాశ్చాత్యభావజాలంలో పడిన హిందువులు నవ్య హిందూత్వాన్ని అనుమానంగా చూస్తుంటారు. ఎందరో దేవతలు, మహర్షులు, ఎన్నో ధర్మశాస్త్రాలు యోగాచరణ విధానాలు కలిగి ఉన్న





హిందూ ధర్మం ప్రపంచంలోని ముఖ్యమైన మతాలన్నింటిలోను అత్యంత ఔదార్యవంతమైనది, సర్వదేశాలకు, సర్వకాలాలకు కూడా వర్తించేది, బహుముఖీయమైనది. అయినప్పటికీ వారు నవ్య హిందూత్వాన్ని ఛాందసవాదం ..... తిరోగమనవాదంగా లేదా ఫాసిజంగా అభివర్ణిస్తుంటారు. హిందూత్వానికి తారుపూయటంలో యీ పాశ్చాత్య భావాలకు హిందువులు గర్వపడుతుంటారు. అయితే సాధారణంగా అందరినీ కలుపుకోలేనివి, ఏకశిలారూపం గలవి, దౌర్జన్యశీలంగలవీ, హిందూత్వంలా యితర నమ్మకాలను ఆమోదించలేనివీ అయిన ఇస్లాం, క్రైస్తవ మతాలను మాత్రం వీరు పల్లెత్తుమాట అనరు. క్రైస్తవ, ఇస్లాం మతాల పట్ల వాటిలోని ఛాందస ధోరణులతోసహా-సహనంతో కూడిన గౌరవ మర్యాదలు పెంపొందిస్తూనే వీరు హిందుత్వాన్ని మాత్రం ఛాందసవాదంతో కూడినదిగా, ప్రమాదభరితమైనదిగా చూపించటానికి తంటాలుపడుతుంటారు. హిందూత్వ భావాలను కాస్త గట్టిగా వ్యక్తపరిచే విశ్వహిందూ పరిషత్ వంటి హిందూ ధార్మిక సంస్థల పొడే వీరికి గిట్టదు. కాని ఇరాన్ వంటి దేశాల పట్ల వీరు చూపించే సహనం అంతా యింతా కాదు. అమెరికా వంటి పాశ్చాత్యదేశాలు ఇరాన్‌ను టెర్రరిస్టు రాజ్యంగా ప్రకటించాయి. కానీ, భారత ప్రభుత్వం మాత్రం ఇరాన్‌కు స్నేహహస్తం చాపటమేగాక ఒక దశలో న్యూక్లియర్ రియాక్టర్లను వారికి అమ్మాలని ఆలోచించటం, ఆయాతుల్లా ఖొమేనీ మరణించినపుడు జాతీయ సంతాపదినాలు ప్రకటించటం వంటివి చేసింది.

భారతదేశంలోని ఇంగ్లీషు పత్రికలను చూస్తే హిందూ అనే పదాన్ని ఛాందసవాదం, అహంకార వాదం .. ఆఖరుకు ఫాసిజంవంటి నానారకాల దుష్టభావాలకు సంకేతనామంగా వాడుతున్నట్లు గమనించవచ్చు. ఏవో చిన్నా చితక హిందూ వర్గాలనేగాక చాలా పెద్దవైన హిందూ ధార్మిక సంస్థలకు కూడా ఈ పేర్లు అంటగడుతున్నారు. పాశ్చాత్యదేశాల పత్రికలు సైతం తమ తమ దేశాల్లోని అధిక సంఖ్యాకులు అవలంబించే క్రైస్తవ,

ఇస్లాం మతాల గురించి విశేషించి ఆయా మతాలకు చెందిన పెద్ద సంస్థల గురించి వ్రాసేటప్పుడు ఎప్పడో పొరపాటుగా తప్ప యిటువంటి పదాలు ప్రయోగించటం జరగదు. అదే సమయంలో భారతదేశ పత్రికలు హైందవేతర సంస్థలను మాత్రం ఆ విధంగా ఎన్నడూ విమర్శించనే విమర్శించకపోవటం నేను గమనించాను. ఈ పత్రికలను చూస్తే హిందూ మతమే యితర మతాల కంటే సహన రాహిత్యంతో రగిలిపోతున్నట్లు అనిపింపజేస్తుంది. కాని ఇదెంత అబద్ధమో యథార్థమైన ప్రతి హిందువుకు తెలిసిన విషయమే.

భారతదేశంలో ఉండగా నాకు నవ్య హిందూత్వంతో పరిచయం కలిగింది. అంతకుముందే నా అధ్యయనాల ఫలితంగా దీనిపట్ల నాకు అభిమానం ఏర్పడింది. వేదాలు స్వయంగా చెప్పే విషయాలు ఒకటి కాగా- ఆధునిక పాశ్చాత్య విద్వాంసులూ, కొందరు భారతీయ విద్వాంసులు కూడా వ్యాఖ్యానిస్తున్నది దానికి విపరీతంగా ఉంటున్న సంగతిని- వేదాలను సంస్కృత మూలంలోనే అధ్యయనం చేసిన నేను గమనించగలిగాను. భారతదేశంలో స్వీయ ప్రతిభాత్మకమైన నాగరికత అంటూ చెప్పకోదగ్గది లేనే లేదని చెబుతూ ఐరోపా వారి ఘనతను బాకాలూదే చరిత్రకారుల దృక్పథానికి అతికే విధంగా - పాశ్చాత్య విద్వాంసులు వేదాలకు వక్రభాష్యాలు చేసారు. ఆసియాపై పశ్చిమ దేశాల వెనుకటి వలస ప్రాబల్యం అక్కడి మేధావుల మస్కిష్కాలపై ఎలా ముద్రవేసిందో నేను చూశాను. వేదాల గురించి యీ వలసవాదుల భావాలనే యీనాటికీ భారతదేశపు పాఠశాలలలో వల్లె వేయిస్తున్న తీరు చూచి నేను దిగ్భ్రాంతుడనయ్యాను. (వలసవాద వ్యతిరేకులైన మార్క్సిస్టులూ దీనికి తందాన తానా అంటున్నారు.) ఈ అపోహలనన్నింటినీ సరిచేసే బాధ్యత నా భుజాలపైననే వేసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఈ దిశలో చేసిన ప్రయత్నంగానే గత కొద్ది సంవత్సరాలుగా నేను వివిధ గ్రంథాలు, వ్యాసాలు రచించి ప్రకటించాను.





# మాతృసంస్థ కబుర్లు

ఆగస్టు 12వ తేదీ ఉదయం పదిగంటలకు గురుదేవులు సత్యనారాయణపురంలోని శ్రీ సాయినాథ, సత్యనారాయణస్వామి దేవాలయానికి వేంచేసారు. స్వామీజీ మౌనదీక్షలో ఉన్నారన్నాగానీ ఆలయ ధర్మకర్తలలో ముఖ్యుడైన శ్రీనివాస్‌గారు "మాకు ప్రతిదీ గురువుగారే ప్రారంభించారు. ఇప్పడు ఈ ధ్వజస్తంభ కార్యక్రమం కూడా వారి చేతి మీదుగానే జరగాలి' వారి సన్నిధే చాలు-పెదవి విప్పనక్కరలేదు" అని పదేపదే అనటంతో స్వామీజీ అంగీకరించక తప్పలేదు. ధ్వజస్తంభ పూజలో పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమం ముగించుకొని, పదకొండింటికే ఆశ్రమానికి తిరిగి వచ్చారు.

ఆగస్టు పదిహేనవ తేదీ భరతఖండానికే పెద్దపండుగ గనుక ఆశ్రమానికీ కోలాహలమే. ముందరి రోజు సాయంత్రమే భరతమాత మందిరం చుట్టూ, పతాక వేదిక చుట్టూ చక్కగా శుభ్రం చేసి, కళ్లాపులు చల్లి, ముగ్గులు తీర్చిదిద్దారు మా కన్నెభామలు. మామిడితోరణాలు, కాగితపు తోరణాలు కట్టారు. జెండా కర్రను కూడా అలంకరించారు. కానీ, పాపం- వరుణదేవుడు ఓ చిరుజల్లు చల్లి ముగ్గులన్నీ చెరిపేసి వెళ్లిపోయాడు. ఉదయం ఎనిమిదిన్నరకల్లా మహోత్సాహంతో వచ్చిన పిల్లలను చూస్తే కన్నీళ్లు తిరిగాయి నాకు. చెల్లాచెదరవుతున్న జాతీయభావాలు, గడియకోసారి కయ్యానికి కాలు దువ్వుతున్న ప్రక్కలో బల్లేల వంటి దేశాలు, నీరసంగా నిరసనలు తెలియజేయటం తప్ప చేష్టలతో బదులు చెప్పలేని ప్రభుత్వం (దీనికి శాంతికాముకత, సహనం అని వెధవ ముసుగులొకటి) ముంచుకొచ్చే ముప్పను గ్రహించలేని యువత ఆటకాయి తనం, కేన్సర్‌కన్నా ఘోరంగా అణువణువునా పాకిన అవినీతిరోగం, స్త్రీని చూడగానే భోగ్య భావాన్ని పెంచుకొని పరమనీచంగా ప్రవర్తించే మృగసంతతీ.... ఈ దేశం ఎటుపోతోంది? ఈ పసిబిడ్డల భవిష్యత్తు ఏమి కానున్నదో! వీరు చివరి దాకా స్వతంత్ర దేశంలోనే జీవిస్తారా అసలు! అని గుండె శోకించింది.

తొమ్మిదిగంటలకు భారతమాతకు వందనం చేసి, పాఠశాలలో సమావేశమయ్యారు పిల్లలంతా. సాయినాథుల వారి మ్రోల దీపారాధన చేసాక-పెద్దలను వేదికపైకి ఆహ్వానించారు. అటుపైన కేంద్రప్రభుత్వోద్యోగిగా రిటైరైన దేశాభిమాని శ్రీ రత్నయ్యగారి చేతుల మీదుగా పతాకావిష్కరణ జరిగింది. వారు పిల్లలు దేశానికి తగిన పౌరులుగా తయారుకావలసిన ఆవశ్యకతను గూర్చి వివరించాక, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గారు దేశం స్వాతంత్ర్యం తెచ్చుకున్న తీరు గురించి, మన గుర్తులను మనం గౌరవించవలసిన విధానం గురించీ మాట్లాడారు. తదుపరి మాతాజీ రోజురోజుకూ కనుమరుగవుతున్న జాతీయస్ఫూర్తి గురించి, దాన్ని చచ్చిపోకుండా కాపాడుకోవలసిన ఆగత్యం గూర్చి, అందుకు ఉపాధ్యాయుల బాధ్యతను గూర్చి వివరించారు.

తరువాత విద్యార్థుల చేత చక్కని సాంస్కృతిక ప్రదర్శన యివ్వబడింది. పద్యాలు, పాటలు, కోలాటం, మూడు భాషలలో నాటికలు, కోలాటాలు, పిరమిడ్ ప్రదర్శనలు, మూకాభినయాలు-మంచి వైవిధ్యంతో జరిగాయి. వాన కురుస్తూనే ఉంది. ప్రదర్శన సాగుతూనే ఉంది. పాపం చూడవచ్చిన పెద్దలు కూడా అలా కాస్తాకూస్తా తడుస్తూనే ఆసాంతం ఉన్నారు. గురుదేవుల మౌనదీక్ష కారణంగా వారి ఉపన్యాసం వినే అదృష్టం పోయింది ఈసారి. మిఠాయిల పంపిణీతో కార్యక్రమం ముగిసింది.

ఆగస్టు 16వ తేదీ వరలక్ష్మీవ్రతం. ఉదయం సన్నగా వానపడిందిగానీ త్వరగానే తెరిపివ్వటంతో కార్యక్రమం కొనసాగింది. ముందురోజు రాత్రే ఆడపిల్లలు అమ్మవారి బొమ్మచేసి పట్టుచీర కట్టి సర్వాంగసుందరంగా అలంకరించారు. తొమ్మిది రకాల నివేదనలు, భక్త కోటికి పంచడానికి ప్రసాదాలు ఉదయాన్నే తయారయ్యాయి. భక్తులు రాసాగారు. గుడి పట్టనట్లుగా ముత్తైదువలు, కన్నెపిల్లలు, చిన్నపిల్లలు-కొత్త బట్టలు, పువ్వులు, పూజా సామగ్రితో కళకళలాడిపోయింది. తొంభైమంది సువాసినులు పూజకు కూర్చోగా వారితో వచ్చినవారు, చూడవచ్చినవారితో గుడి నిండిపోయింది. చక్కగా అలంకృతమైన మంటపంలో అమ్మవారిని ఉంచి, ప్రతి మంత్రానికీ మౌలికార్థాలు వివరిస్తూ పూజ చేయించారు. అనంతరం ఒకరికొకరు తాంబూలాలిచ్చుకొనేవేళ-యీ వ్రతానికి తెర వెనుక ఏర్పాట్లన్నీ






చేసిన ఆశ్రమ యువతులు చి॥మంజుల, చి॥సాయిగీత, చి॥సాయిదత్తలకు అభినందనాశీస్సులు ఇచ్చారందరూ. హారతి తరువాత ప్రసాద వినిమయం జరిగింది. భారత స్వాతంత్ర్యం అక్షతంగా ఉండాలన్న ప్రార్థన యీ వ్రతంలో చేయించటం విశేషం.

20 ఆగస్టున రక్షాపూర్ణిమ సందర్భంగా ద్వారవతిలో విశేషపూజలు జరిగాయి. పాఠశాల విద్యార్థులు భారతమాతకు రాఖీకట్టి, "తల్లీ, భారతీ, నీవు ధర్మస్వరూపిణివి, జ్ఞానస్వరూపిణివి. నీవే మాకు రక్ష నీవైపు వైరివర్గం కన్నెత్తి చూస్తే మేము నీకు వెన్నుదన్నుగా, రక్షగా నిలిచేందుకై యిదే మా ప్రతిజ్ఞ" అని ప్రమాణం చేసారు.

ఆగస్టు 28వ తేదీ శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ద్వారవతిలో శ్రీసాయి కృష్ణుని, భగవద్గీతను అర్చించారు. వెన్న, మీగడ, పాలు నివేదించి కృష్ణాష్టకం, మధురాష్టకం చదివి గీతలోని మూడు అధ్యాయాలు పారాయణ చేసారు. శ్రీకృష్ణుని అవతార విశిష్టత వివరించి చెప్పగా తెలుసుకున్నారు భక్తులందరూ.



## దీపం ఎందుకు?



- మాతా శుకవాణి

"పూజ చేసేటపుడు దీపం ఎందుకుపెట్టాలి? మనకు వెలుగిచ్చేది ఏదైనా దీపమే గదా! కరెంట్‌తో బల్బు వెలుగుతుండగా మరో దీపం దేనికి?" ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువతి ప్రశ్నించింది ఒకరోజు.

"అమ్మా! దీపంలో జ్వాల ఉంటుంది. ఆ అగ్నిజ్వాల మనచుట్టూ ఉన్న వాతావరణంలోని మిథేన్ అనబడే విషవాయువును పరిహరిస్తుంది. నీ ఎలెక్ట్రిక్ బల్బ్ వెలుగు ఆ పనిచెయ్యలేదుగా!" అన్నాను.

"అది దేవుఁడి ముందే పెట్టాలా? ఇంట్లో ఎక్కడైనా పెట్టవచ్చుగా!" అన్నదా పిల్ల - 'ఇహ చెప్పు' అన్నట్లు.

"సాధారణంగా హిందువుల యిళ్లల్లో దేవుడి గది ఈశాన్యమూల ఉంటుంది. మన దేశానికి నైఋతి ఋతుపవనాలు ఎక్కువ. అవి ఈశాన్య మూలగా వెడుతూండగా అక్కడ ఉన్న దీపజ్వాల ఆ గాలిలోని మిథేన్‌ను

పరిహరించి వాతావరణం అంతా పరిశుద్ధం చేస్తుంది. అందుకూ అక్కడ పెట్టడం!"

కొద్దిగా ఆలోచనలో పడింది ఆ అమ్మాయి.

"అసలు దీపం అంటే ఏమిటమ్మా? చీకటిని తొలగించేదే గదా! భగవంతుని ముందు దీపం పెట్టటం ద్వారా మనం ఇంటిలో ఉన్న అనారోగ్యం, భావవైరుధ్యాలు, అప్పలు, దరిద్రం-యిన్ని చీకట్లు పోగొట్టమని అడుగుతున్నాం. అన్నిటినీమించి మనలో అజ్ఞానం అనే చీకటి మహా దట్టంగా ఉంటుంది. 'స్వామీ! నీ ముందర యీ దీపం వెలుగుతున్నట్లు నాలో జ్ఞానదీపం వెలిగించు' అని ప్రార్థిస్తున్నామన్నమాట"- మరికొంచెం వివరించాను. అవతలివారు చెప్పేది మంచే అని తెలిసినా ఓటమిని అంగీకరించలేకపోవటం నేటి తరం ప్రత్యేకత గదా! ఆ పిల్ల మరో ప్రశ్న వేసింది.

"మా అమ్మమ్మ దీపం నోటితో ఊదితే తిడుతుంది. తప్పేమిటి? దీపం ఆరిపోయింది అననివ్వదు కూడా".

"అమ్మా! దీపం ఆర్పటం, దీపం ఆరిపోయింది అనటం అశుభసూచకాలు. ఇంటికైన దిక్కు మరణిస్తే ఆ యింటి వెలుగుపోయినట్లు. అలాగే దీపం ఆర్పటం అంటే అవతలివారి జీవితాలు నాశనం చేసినట్లన్నమాట. మన పల్లెల్లో పెద్దతిట్టు "ఓరి నీ దీపం ఆరా!" అనేది. మన భూమి సంస్కృతి అనాదిగా పదిమంది జీవితాల్లో దీపాలు వెలిగించేదేగానీ-ఆర్పేది కాదు. అలాంటిది మనం స్వయంగా నోటితో గాలి ఊది, ఆర్పటం పాపంగా భావించటంలో తప్పేముంది? అది దేవుడి ముందరి దీపమైతే మరీ దోషం. మన నోటి ఉమ్ము తుంపరలు ఆ దీపం మీద, వాటి చుట్టూరా చిందిస్తే తప్పేగా! మనవాళ్లు విదేశ సంప్రదాయాల వెంటబడి, శుభమా అని పుట్టినరోజు పూటా దీపాలు ఆర్పటం ఎందుకు? అది కూడా కేకు మీద పెట్టి, నోటి తుంపరలతో దాన్ని పావనం చేస్తూ" అన్నాను.

"ఇన్నేళ్లు మన జీవితాలలో అయిపోయాయనడానికి సూచనగా అలా ఆర్పుతాం కొవ్వొత్తులను. అవి దీపాలు కావుగా" అంది ఆ పిల్ల యింకా బింకంగానే.

"చూచావా, నీ రక్తంలోని సంస్కారం నీతో ఎలా అనిపించిందో! కొవ్వొత్తులు దీపాలు కావన్నావు, మరి ఎలక్ట్రిక్ లైట్లు దీపాలెలా అవుతాయి? అయినాగానీ మనవాళ్లు లైట్ స్విచ్ కూడా కుడిచేత్తో వెయ్యాలని





అంటారు-అదీ వెలుగిస్తుంది గదా అని. ఇకపోతే-ఇన్నేళ్లు కరిగిపోయాయి జీవితంలో అన్నదానికి సూచనగా దీపాలు ఆర్పుతారన్నావు. మనకు ఇన్నేళ్ల అనుభవాన్ని, పచ్చని జీవితాన్ని మనకు దైవం యిచ్చాడు-అన్న దానికి గుర్తుగా, రానున్న సంవత్సరాన్ని కూడా యిలాగే సార్థకం చేసుకొనేలా అనుగ్రహించమని అడుగుతూ ఎన్నేళ్లు గడిస్తే అన్ని దీపాలు పెట్టవచ్చుగదా!"

"అవును-ఇదీ బాగానే ఉంటుంది. అది సరేనండీ, దేవుడి ముందు దీపం ఆవునేతితోనే పెట్టాలట. అందుకోసం ఓ ఆవును కొనిపించింది మా అమ్మమ్మ. అదిచ్చే ఒక్క లీటరు పాలలో వచ్చే పిసరంత వెన్నపూస కరగబెట్టి ఆ నేతితోనే  వెలిగిస్తుంది దీపం. అంత అవసరమంటారా?"

"ఆవిడ చాలా మంచిపని చేస్తోందమ్మా! కొందరు తెలిసీ, కొందరు యిది సంప్రదాయమన్న నమ్మకంతోనూ యీ విషయంలో సరిగానే ఆలోచిస్తున్నారు. అగ్నితో హోమం చేస్తే ఆవునెయ్యే వాడతారు. కాలిన ఆవునేతి నుండీ వచ్చే వాయువు మాత్రమే ఆకాశంలో ఆరు నుంచీ ఎనిమిది కిలోమీటర్ల దాకా వెడుతూ, వాతావరణం అంతా పరిశుద్ధం చేస్తుందనీ, నీటి ఆవిరిని సమీకరించి వర్షం కురిపిస్తుందనీ మన ప్రాచీనులకు తెలియడమే దీనికి కారణం. ఆయుర్వేదంలో దీన్ని గురించి ఎంతో ప్రశస్తంగా చెప్పబడింది. మనవాళ్లే కాదు రష్యన్ శాస్త్రవేత్త డా॥ శిరోవిచ్ అనే ఆయన ఆవునెయ్యి కాల్చిన ప్రభావం వాతావరణంలోని రేడియేషన్ ప్రభావాన్ని తగ్గిస్తుందని తన పరిశోధనల ద్వారా ఋజువు చేసాడు.

చూడమ్మా! ఆది నుంచీ మనది ఆధ్యాత్మిక దేశం. మన ఋషి పరంపర అంతా దాదాపు ఏదో ఒక రంగంలో శాస్త్రవేత్తలే. మన వంటి సామాన్యులకు ఆచరించడానికి బద్ధకం వేస్తుందని ప్రతిదాన్నీ దేవుడితో ముడిపెట్టి చెప్పారే తప్ప-మన సంప్రదాయాలన్నీ శాస్త్రీయదృక్పథంతో ఏర్పరచినవే. ఏవో అతికొద్దిగా మూఢమైనవి మధ్యలో దూరి ఉండవచ్చుగానీ ఏవీ కొట్టిపారెయ్యవలసినవి కావు" అన్నాను.

నా ప్రత్యర్థి పెదవులకొసల చిరునవ్వు వెలసింది.

"సరే, అయితే యివ్వేళ్టి నుంచీ నేనే మజ్జిగ చిలికి వెన్న తీసిస్తాను మా అమ్మమ్మకి" అన్నది కాస్త కొంటెగానూ, మరికొంత నిజంగానూ.

# అవధూతలు

– పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీజీ

ఆధ్యాత్మిక విషయాల గురించి కొద్దోగొప్పో తెలిసిన వారందరికి అవగాహనకు వచ్చిన విషయం ఒకటున్నది.

"అన్ని జీవరాశుల్లోనూ మానవజన్మ శ్రేష్ఠమైనదనీ, 84 లక్షల యోనుల్లో పుట్టి చచ్చీ, పుట్టీ చచ్చీ అనేక యాతనలు పొందిన తరువాత పుణ్యవశాత్తు ఎంతో విలువైన ఈ మానవజన్మ లభించిందనీ'.

మనకున్న పుణ్యం వెలగా యిచ్చి యీ మానవజన్మను కొనుక్కున్నామన్నమాట.

అంటే పుణ్యం పోయింది దాని బదులుగా యీ మానవజన్మ వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకోకపోతే అటు పుణ్యమూ పోయి, దానికి బదులుగా వచ్చిన యీ జన్మ వృథా అయిపోతే రెంటికీ చెడ్డ రేవడిగా మిగిలిపోతాం.

మన ఋషులు మాత్రమేకాక సాక్షాత్తు కృష్ణ పరమాత్మ చెప్పిన మార్గంలో గురుబోధననుసరించి సదాచారం పాటించి, జనన మరణ విషవలయం నుండి బయటపడి, చిదానంద స్వరూపంగా మిగిలిపోవ టమే దీని ప్రయోజనం. ఇది బుద్ధిజీవులైన మానవులకే సాధ్యం.

ఈ గమ్యం చేరటం అందరికీ సాధ్యమా? అనే ప్రశ్న రావచ్చు. ఇంతకు ముందు గూడా మానవజన్మ పొంది కొంత సాధన చేసి ఉన్న వారికి యిదే చివరి జన్మ కావచ్చు. ఇప్పుడు సాధన ప్రారంభించిన వారికి మరుజన్మలలో ఇది సాధ్యం కావచ్చు. ఇది స్పష్టంగా గీతాచార్యులే చెప్పారు. సాధన వృథా కాదు.

సాధుసన్న్యాసులందరూ కూడా ఈ మార్గంలో ఉన్నవారే. భక్తిమార్గము, కర్మమార్గము, ధ్యానమార్గము మొదలైన వివిధ పద్ధతులు కావచ్చు. చివరికి యివి అన్నీ జ్ఞానమార్గంలో పర్యవసించేవే. సన్న్యాసుల్లో కూడా స్థాయీభేదా





లున్నాయి. కుటీచక, బహూదక, పరివ్రాజక, హంస, పరమహంస అనేవి. పరమాత్మకూ తనకూ అభేద స్థితిని గమనించే స్థాయి చిట్ట చివరిది.

వారి స్థితి గీతలో కృష్ణ పరమాత్ములవారు చెప్పినట్లు -

*శ్లో॥ సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।*

*ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ - 6-29*

సర్వవ్యాప్తమైన అనంత చైతన్యమునందు ఏకీభావ స్థితి రూప యోగ యుక్తమైన ఆత్మగలవాడును, అంతటను అన్నింటిని సమభావముతో చూచువాడును అగు యోగి తన యాత్మను సర్వప్రాణులయందు స్థితమై ఉన్నట్లుగను, ప్రాణులన్నిటిని ఆత్మయందు కల్పితములుగను భావించును (చూచును).

ఇట్టి స్థితి సాధ్యమా? గీతాచార్యులవారు చెప్పినట్లు -

*శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।*

*యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ - గీ. 7-3*

వేలకొలది మనుష్యులలో ఎవడో ఒకడు మాత్రమే నన్ను గూర్చి తెలిసి కొనుటకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించిన వారిలోగూడ ఒకానొకడు మాత్రమే మత్పరాయణుడై తత్త్వమును - అనగా నా యథార్థ స్వరూపమును ఎరుంగును.

దీనికోసం సాధకులు - మహాయోగి అవధూత వేమనగారు చెప్పినట్లు కొంత తత్త్వచింతన చేయాలి.

*"ఎచటినుండి వచ్చు ఎచటికి తాబోవు*
*నిదుర చందమెరుగ నేర్చెనేని*
*సర్వముక్తుడగును సర్వమ్ముతానౌను*
*విశ్వదాభిరామ వినుర వేమ ॥"*

తాను పుట్టకముందు ఎక్కడ ఉండేవాడు, మరణించిన తరువాత తానెక్కడికి పోతాడు అనేది విచారించాలి. నిదురించేటప్పడు తాను

(ఆత్మ) ఉంటాడుగాని పరిసరాల్లో జరిగేదాన్ని ఏమీ తెలిసికొనలేడు. అలాగే మెలకువతో ఉన్నా బాహ్యవిషయాల స్పృహలేని వారికి ఈ లోక విషయాలేవీ అంటవు. కర్తృత్వభోక్తృత్వాలు ఉండవు. నిరంతరం ఆత్మస్థితుడై ఉండటంచేత ఘటాకాశము చిదాకాశము లీనమై అంతటా తానే ఔతాడు. అతని స్థితి గీతలో చెప్పినట్లు -

*శ్లో॥ యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।*
*సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి నలిప్యతే ॥* - గీ. 5-7

మనస్సును వశమందుంచుకొనినవాడు, జితేంద్రియుడు, అంతఃకరణ శుద్ధి కలవాడు, సర్వప్రాణులలో ఆత్మస్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడు అగు కర్మయోగి కర్మలను ఆచరించుచున్నను ఆ కర్మలు వానికి అంటవు.

యోగి వేమన ఆ స్థితిని సాధించి దిగంబరుడై అవధూతగా లోక సంచారం చేస్తూ అనేక వందలపద్యాలలో ధర్మబోధ చేస్తూ వచ్చారు.

అవధూత స్థితికి చేరిన మహాత్ములు కొందరు పై శ్లోకంలో చెప్పినట్లు లోకకళ్యాణం చేస్తూ ఉంటారు, కొందరు ఏమీ పట్టనట్లుగానే ఉంటారు. వారు మానావమానాలను, అరిషడ్వర్గాన్ని, రాగద్వేషాలను, అహంకార మమకారాలను జయించి ఉంటారు.

"నిర్మమో నిరహంకారో సమదుఃఖ సుఖఃక్షమీ" ఇదీ వారి స్థితి.

అవధూత అందరిలోనూ తననే చూసుకుంటారు. కాబట్టి లోకంలో తాను తప్ప ఎవ్వరూ లేరు. అందుచేత వస్త్రధారణ గురించి కూడా వారు పట్టించుకోరు. శ్రీ రమణమహర్షుల వారు ఒక్క కౌపీనం మాత్రమే ధరించి తిరిగేవారు. శ్రీ రామకృష్ణ పరమహంసల వారు ఒక అంగవస్త్రం మాత్రమే పిచ్చిపిచ్చిగా కట్టుకొనేవారు. ఒకప్పుడు అది గూడా ఉండేది కాదు.

నడుస్తున్న దేవుడని కీర్తింపబడిన కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖర భారతీ స్వాముల వారు కూడా వస్త్రధారణ గురించి అంతగా





పట్టించుకునేవారు కాదు.

నా పదమూడవ ఏట అలాంటి అవధూతను దర్శించుకునే భాగ్యం కలిగింది. మా పితృపాదులు గొప్ప యోగసాధకులు (గీతలో చెప్పిన దైవీ గుణాలన్నీ పుణికిపుచ్చుకున్న కర్మయోగి) శ్రీ చిల్లర మాణిక్యరాయ శర్మ మహారాజులవారు మహారాష్ట్రలో లాతూర్ రోడ్డు అనే రైల్వేస్టేషనులో స్టేషన్ మాస్టరుగా విధులు నిర్వహిస్తున్నారు. స్కూలు సెలవుల్లో నేను అక్కడకు వెళ్ళటం జరిగింది. ఒక దిగంబర మౌనసాధువు, సుమారు 5.6' ఎత్తూ, నల్లని రూపమూ, చింపిరి జుట్టు, చింపిరి గడ్డమూ హఠాత్తుగా స్టేషను ప్లాట్‌ఫారం మీద కనిపించేవారు. చేతులు వెనకాల పెట్టుకొని ఎటో దీక్షగా చూస్తూ పచారు చేస్తూ ఉండేవారు.

ఒకసారి సెలవులలో నేను ఇంటికి వెళ్ళినరోజు ఆయన హఠాత్తుగా మా ఇంట్లోకి వచ్చారు. మా నాన్నగారు ఎంతో సంతోషంతో వారి ముందు విస్తరివేసి శ్రద్ధగా వడ్డించారు. వారు అన్ని పదార్థాలను కలిపివేసి మూడు నాలుగు ముద్దలు తినివేసి చేయి గూడ కడుక్కోకుండా మౌనంగా వెళ్ళిపోయారు.

వారిని గురించి ఆ ప్రాంతీయుల్ని విచారించాను. సుమారు ఆరు సంవత్సరాల క్రిందట వారు ఒక అంగవస్త్రం మాత్రం లేదా కౌపీనం మాత్రం ధరించి తిరిగేవారట. వాన బాగా కురిసి మురుగుకాలువలో నీరు ప్రవహిస్తుంటే దోసిలితో ఆ నీరు త్రాగబోతున్నారట. ఎవరో అది చూసి వారించితే దోసిలి చూపించారట. దాంట్లో స్వచ్ఛమైన నీరు కన్పించిందట.

లాతూర్ రోడ్డు స్టేషన్ నుండి జిల్లా కేంద్రస్థానమైన లాతూర్ నగరానికి 30 మైళ్ళ దూరం. ప్రతిరోజూ ఆ రెండు ప్రదేశాల మధ్య ప్రభుత్వపు బస్సులు నడుస్తుండేవి. ఒకరోజు ఆ స్వామి బస్సు దగ్గరకు వెళ్ళి తనను బస్సులో లాతూరుకు చేర్చమని అడిగారట. ఆ కండక్టరు టిక్కెట్టు లేకుండా బస్సులో ప్రయాణం కుదరదనీ అంతగా కావాలంటే బస్సు వెంట పరుగెత్తుకు

రావచ్చనీ ఎగతాళిగా మాట్లాడి వెళ్లిపోయాడట. లాతూరులో అతడు బస్సు దిగుతుండగా ఎదురుగా ఈ స్వామి కనిపించారట. ఆశ్చర్యంతో ఎలా వచ్చారని ప్రశ్నిస్తే "నీవు చెప్పావుగా బస్సు వెంట పరుగెత్తుకొని వచ్చాన"న్నా రట. అంతే ఆ కండక్టరు క్షమించమని కాళ్లమీద పడ్డాడు. ఈ విషయం తెలిసి జనం పూజలూ, భజనలూ ప్రారంభిస్తే అక్కడినుండి అదృశ్యమై మళ్లీ యిప్పుడు ఆరేళ్ల తరువాత పూర్తి దిగంబరంగా ప్రత్యక్షమైనారు. ఇప్పడు పూర్తిగా మౌనం. ఎవరినీ ఏమీ అడగరు. కొందరు ఏదన్నా పెడితే తీసు కుంటారు. కొందరివి తిరస్కరిస్తారు.

ఆ తరువాత కొద్దిరోజులలోనే మా నాయనగారికి గంగాఖేద్ (పాండు రంగని అకళంక భక్తురాలు జనాబాయి పుట్టిన ఊరు) బదిలీ కావటం వలన మళ్లీ ఆ అవధూత దర్శనానికి అవకాశం లేకపోయింది.

ఇలా ఎందరో మహానుభావులు !

వీరందరిలోని సామాన్య లక్షణం ఏమిటంటే - అన్ని దుర్గుణాలకూ రాజైన 'అహంకారాన్ని' జయించటం. తాము వేరూ యితరులు వేరూ అన్న భావమే ఉండదు. అందరిలోనూ ఉన్న పరమాత్మే తానని అనుభూతి పొందటం.

శ్రీ రమణ మహర్షుల వారిని ఒక భక్తుడు అడిగాడు 'స్వామీ మీరెప్పడూ కిటికిలోనుండి ఆ కొండ శిఖరంవైపూ, ప్రకృతివైపూ చూస్తు న్నట్లుంటారే, దేన్ని చూస్తుంటారు'. మహర్షుల వారి సమాధానం "నన్నే నేను చూసుకుంటూ ఉంటాను". వారు సమాధి చెందేముందు భక్తులు దుఃఖిస్తూ మీరు వెళ్తే మాగతేం కాను" అని ప్రార్థించారట. అప్పడు వారి సమాధానం "నేను ఎక్కడకు వెళ్లగలను? వెళ్లడానికి చోటేది?"

చూచారా! అదీ వారి సర్వాంతర్యామిత్వపు అనుభూతి (అంతట తానైయున్న అనుభూతి). అహంకారరాహిత్యానికి ముందు వినయము, నమ్రత సాధించాలి. మన ఆలోచనలో, మాటలో, ప్రవర్తనలో ఈ నమ్రత





ద్యోతకమవ్వాలి. దీనికి మార్గదర్శకంగా ఆదిగురువులు దత్తాత్రేయుల వారు తమకు 24గురు గురువులని చెప్పారు. నమ్రత ఉన్నవాడే యితరుల నుంచి నేర్చుకోగలడు అని దీని తాత్పర్యం.

నేడు అనేకమంది సాధకులు యీ మార్గంలో పయనిస్తున్నారు. ఇలాంటి వారిలో నాకు ముందుగా గుర్తుకొచ్చేవారు-ఇటీవలనే బ్రహ్మీభూతు లైన దేవానంద చిన్నస్వామిగారు (శివానంద ఆశ్రమం-హృషీకేశం) ప్రస్తుత ఏర్వేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వామివారు కూడా ఈ మార్గంలోనే పయనిస్తున్నారు.

మనం యిప్పడు పొందిన మానవజన్మ సాఫల్యం చెందటం కోసం భవ్యమైన మార్గం నిర్దేశించుకొని ఆదర్శవంతులైన మహనీయుల దర్శ నమూ, ఆశీస్సులనూ పొందాలి. నిరాడంబర, నిరహంకార జీవితాలు గడు పుతూ లోకకళ్యాణం కోసం జీవించిన, జీవిస్తున్న ఎందరో అవధూతలు. అలాంటి వారిలో ప్రస్తుతం పిఠాపురం శివారులో ఉన్న శ్రీ గోపాల్‌బాబా ఒకరు. పిఠాపురంలోనే శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం నడుపుతున్న శ్రీ సజ్జన్‌గడ్ రామస్వామిగారు కూడా ఆ త్రోవలోనే ఉన్నారు.

అవధూతలు శరీరాలు వదలినా వారి శక్తి ఎల్లప్పడూ పరివ్యాప్త మౌతూనే ఉంటుంది. అంచేత బ్రహ్మీభూతులైనా వారి చరిత్రలు మనకు ఆశీస్సులందిస్తూ మార్గదర్శకంగా నిలుస్తాయి.

**వచ్చే సంచిక నుండీ శ్రీ దాసుగణు మహారాజులవారు రచించిన శ్రీ గజానన విజయాన్ని అనుసరించి శ్రీ గజానన మహారాజుల వారి దివ్య చరిత్ర ధారావాహికంగా మీకు అందిస్తాము.**

**(సంపాదకురాలు)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

17-12-1911

ప్రార్థనానంతరం సాయి మహరాజు బయటికి వెళ్ళి తిరిగి రావటం చూచాను. ఆయన ఉల్లాసంగా ఉన్నారు. ఆయన చతురోక్తులకు మేమంతా ఆనందించాం. మేఘ మారేడు ఆకుల కోసం వెళ్ళి తిరిగి రావటం ఆలస్యం కావటంతో అల్పాహారం ఆలస్యమైంది. మధ్యాహ్నం నేను హాజీ సాహెబ్ ఫాల్కే, డా॥ హాటే, షిన్గ్డే తదితరులతో మాట్లాడుతూ కూర్చున్నాను. గోఖలే ఈ వేళ వెళ్ళిపోయాడు. సాయంత్రం నేను మసీదుకు వెళ్ళానుగానీ - సాయి మహరాజు నన్నూ, నా సహచరులనూ దూరం నుంచే వెళ్ళిపొమ్మన్నారు. నా కొడుకు బల్వంత్‌ను మాత్రం దగ్గరికి పిలిచి దక్షిణ యిమ్మన్నారు. చావడి దగ్గర నమస్కారం చేసుకున్నాక శేజారతికి వెళ్ళాం. ఈ రాత్రి సాయి చావట్లో పడుకుంటారు.

18-12-1911

నా కంఠం నిన్నటికన్నా నయం. ప్రార్థన తరువాత నేను షిన్గ్డే, వామనరావు పటేలు, దర్వేష్ సాహెబ్‌లతో మాట్లాడుతూ కూర్చున్నాను. సాయి మహరాజు బైటికి వెడుతుండటం చూచాను. ఆయన తిరిగి వచ్చాక మసీదులోకి వెళ్ళాను. నేను నా బక్కెట్ నింపుకున్నాననీ అన్నారు. "నాకు నిద్ర లేకుండా నానా యిబ్బందీ పడుతుంటే - నువ్వేమో వేపచెట్ల మీది చల్లగాలులు అనుభవిస్తూ ఆనందంగా





ఉన్నావు" అన్నారు నన్ను. సాయి చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆయనను పూజించుకోవడానికి చాలామంది వచ్చారీవేళ. మా ఆవిడ కూడా వచ్చింది. మధ్యాహ్నహారతి తరువాత విడిదికి వచ్చి భోంచేసి హాజీ, బాపూ సాహెబ్ జోగ్ తదితరులతో మాట్లాడుతూ కూర్చున్నాను. సాయంత్రం కాబోతుండగా మసీదుకు వెళ్ళి సాయిసాహెబ్ ప్రక్కన కూర్చున్నాము. ఇంకా ప్రొద్దుపోవ డానికెంతో సమయం లేదు. అంచేత ఆయన మాకు సెలవిచ్చే సారు. చావడి దగ్గర నిలబడి ఆయన దర్శనం చేసుకొని, విడిదికివెళ్ళి భీష్మ భజన వింటూ కూర్చున్నాము. సాయి ఒక కథ చెప్పారు. ఒక ధనవంతుడు - ఐదుగురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్న వ్యక్తి ఉన్నాడు. వారిలో నలుగురు కొడుకులు స్థిర, చరాస్తులలో తమ వాటాలు తీసుకున్నారు కానీ చిన్న కొడుక్కీ, కుమార్తెకీ వాళ్ళ వాటా దొరకలేదు. వాళ్ళు ఆకలితో అలమటిస్తూ సాయిబాబా దగ్గరకు వచ్చారు. వాళ్ళ దగ్గర ఆరు బళ్ళ ఆభరణాలుండేవి. దొంగలు వాటిలో రెండు బళ్ళు దోచు కున్నారు. మిగిలిన నాలుగు మర్రిచెట్టు క్రింద దాచి ఉంచారు. సరిగ్గా యీ విషయం దగ్గరికి వచ్చేటప్పటికి త్రియంబకరావు (ఇతన్ని బాబా మారుతి అని పిలుస్తారు) వచ్చాడు. దానితో కథ దారి మార్చుకున్నది. మధ్యాహ్నహారతి తరువాత విడిదికి వచ్చి భోంచేసాక దర్వేష్ సాహెబ్‌తో మాటల్లో పడ్డాను. వామన రావు పటేల్ ఇవ్వేళ వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం రామ్‌మారుతి బువా వచ్చాడు. భజన సమయంలో అతడు ఎగురుతూ నాట్యం చేసాడు. మేము సాయిని సాయంత్రం, తిరిగి శేజారతి టైమ్‌లో చూచాము. రామ్ మారుతి బువా భీష్మ భజనలో కూడా నాట్యం చేసాడు. ఈ సాయంత్రం సాయి మహరాజు నీమ్‌గాంవ్‌కు వెళ్ళారు. డేంగలేను చూచి, ఒక చెట్టు కొట్టి తిరిగి వచ్చారు. ఆయన వెళ్ళేటపుడూ, వచ్చేటపుడు కూడా అనేకమంది భక్తులు వాద్యాలు మ్రోగించు కుంటూ సాయితో వెళ్ళారు. నేను వెళ్ళలేదు. సాయికి నమస్కరించటానికి రాధాకృష్ణమాయి మా వాడా దగ్గరకు వచ్చింది. ఆమెను పెద్ద మేలిముసుగూ అవీ లేకుండా చూడటం అదే మొదటిసారి.

**(సశేషం)**

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

చాలాకాలం క్రిందటి మాట యిది. ఒకానొక గ్రామంలో ఓ పెద్ద శివాలయం ఉండేది. దానిలో ఒక మంచి గంట ఉంది. అది కొడితే రెండు మైళ్ల దూరం దాకా విన్పిస్తుందని అంటారు. కానీ అది ఒకరు కొడితే మ్రోగేది కాదు. సంవత్సరానికోసారి తనంతట తానే మ్రోగుతుంది. అది మ్రోగిన సంవత్సరం వానలు బాగా కురుస్తాయి. వానలు బాగా కురిస్తే పంటలు బాగా పండుతాయి. అంతా సుభిక్షంగా ఉంటుంది.

గంట మ్రోగని సంవత్సరం వానలుండవు. మరి గంట ఎప్పుడు మ్రోగుతుందో, ఎప్పుడు మ్రోగదో ఎలా తెలుస్తుంది అంటే - మన ఊళ్లో ఏదైనా మంచిపని జరిగితే శివుడికి సంతోషం కలిగితే ఆ గంట తనంతట తనే మ్రోగుతుంది అంటారు గ్రామంలోని వృద్ధులు.

ఇలా ఉండగా - ఓసారి వరసగా నాలుగేళ్లు గంట మ్రోగలేదు. అంటే వానలు పడలేదు. పిన్నలు, పెద్దలు, పశువులు, మొక్కలు, చెట్లు, నేలతల్లి, అన్నీ దాహంతో, ఆకలితో అల్లాడుతున్నాయి. ఎలా ఏం చెయ్యటం? ఏంచేస్తే స్వామి కరుణ కలుగుతుంది? అందరూ ఒకచోట సమావేశమై ఆలోచించారు.

"వచ్చే శివరాత్రినాడు సంపూర్ణంగా ఉపవాసం ఉందాం. మనకున్న దానిలో శ్రేష్ఠమైన వస్తువులను స్వామికి కానుకలుగా యిద్దాం. ఆయనను దయ చూడమని ప్రార్థించి జాగరణ చేద్దాం" అని నిర్ణయించుకున్నారు. పిల్లలు కూడా తామూ ఉపవాసం ఉంటామని సరదా పడ్డారు.

ఆరోజు రానే వచ్చింది. ఈ వార్త పొరుగూళ్ల క్కూడా పాకటంతో అంతా





అదే మాదిరిగా అనుకొన్నారు. అన్ని ఊళ్లవాళ్లూ శుచిగా తయారై తమకు ఉన్నంతలో మంచిమంచి కానుకలు తీసుకొని శివాలయంవైపు రాసాగారు.

ఐదేళ్ళ చిట్టితల్లీ, ఏడేళ్ల బాబుగాడు చెల్లీ, అన్నాను. వాళ్లమ్మ కాస్త అనారోగ్యంగా ఉండటంతో తానెలాగూ గుడిదాకా వెళ్లలేననుకొన్నది. పిల్లలకు తలంటిపోసి, పిల్లవాడికి ఓ చిన్నచెంబులో కాసిన్ని పాలు పోసి "స్వామి అభిషేకానికి" ఇమ్మన్నది. చిట్టితల్లి చేతికి నాలుగు అరటిపళ్లిచ్చింది. శివుడికి నమస్కారం చేసుకొని "తండ్రీ! నీ గంట మ్రోగించు. వానలు కురిపించు. మా భూమి పచ్చబడి అందరూ హాయిగా ఉండేలా చెయ్యి అని కోరుకోండి. బాలవాక్కు బ్రహ్మవాక్కంటారు. ఏమో దేవు(డు మీ మొరనే తొందరగా వింటాడేమో!" అని కూడా అన్నది.

పిల్లలు వీధిలోకి వచ్చేసరికి అంతా హడావుడిగా ఉంది. చిట్టితల్లి చెయ్యి పట్టుకొని బాబు మెల్లగా నడవసాగాడు. వాళ్ల ఊరు ఇంత హంగామాగా ఉండటం వాడెప్పుడూ చూడలేదు. ఆశ్చర్యంగా చూస్తూ నడుస్తున్నాడు.

ఎవరో ఇద్దరు వ్యక్తులు వీళ్ల ముందే మాట్లాడుకొంటూ వెడుతున్నారు. "సేనాపతిగారు వచ్చారు. ఆ మధ్య యుద్ధంలో గెలిచినప్పుడు రాజుగారు తనకు బహుమతిగా యిచ్చిన వెండినాణేలు మొత్తం తెచ్చి శివయ్య ముందు రాశిగా పోసారు" అని ఒకరంటే "అయితే శివుడికి దయ కలిగిందా? గంట కొట్టాడా?" అని యింకొకరు అడిగారు. "అంత పెద్ద గంట మ్రోగితే నీకు వినపడదంటావా, నీకేమన్నా చెవు(డా?" అన్నాడు మొదటివ్యక్తి. నవ్వుకుంటూ వెళ్లిపోయారిద్దరూ.

ఊరి మధ్య బడి దాకా వెళ్ళేటప్పటికి మంత్రిగారు వచ్చి వెళ్ళారనీ, బోలెడన్ని మణులు తెచ్చి శివునికి కానుక యిచ్చారనీ అంటూ శివుడు కనికరించలేదనీ అనుకోవటం విన్నాడు. మరికాస్సేపటికి "మహారాజుగారు వచ్చారు. శివునికి మణికిరీటం తెచ్చారు" అని అనుకుంటుంటే విన్నాడు బాబు. వాడి వయసుకవి అర్థమయ్యీ కాకుండా ఉన్నాయి. అంతలో కోనేరు వీధి వచ్చింది. ఆ వీధి దాటితే యిక శివాలయమే.

**(సశేషం)**

# అతడెప్పుడు వస్తాడంటే

- శుకవాణి

ఒక ప్రభువు భక్తిపరుడు, మంచి పరిపాలకుడూను. ఆయనొకసారి ఒక సద్గురువు దగ్గరకు వెళ్ళి నమస్కరించి, పాదాలచెంత కూర్చొని, "స్వామీ ఈ కాలంలో కూడా భగవద్దర్శనం చేసుకోగలమా? ఏం చేస్తే అది పొంద గలమో సెలవివ్వండి" అని ప్రార్థించాడు. గురువు చల్లగా నవ్వి, "నాయనా, అంతఃకరణ శుద్ధమైతే భగవత్ప్రాప్తి లక్షణంగా కలుగుతుంది. పరమాత్మ ప్రతి జీవిలోను ఉన్నాడు గనుక-సమస్త ప్రాణులను నిష్కామంగా, శ్రద్ధగా సేవిస్తూ ఉంటే నీ కోరిక నిస్సందేహంగా నెరవేరుతుంది" అని బోధించాడు. రాజుగారు సరేనని వెళ్ళిపోయారు. అక్కడినుండీ తన రాజ్యంలోని ప్రజలందరికీ మేలు చేసే ఎన్నో సత్కార్యాలు చేయసాగాడు.

క్రొత్తగా ధర్మసత్రాలు కట్టించాడు. నీళ్ళకు పెద్దపెద్ద బావులు త్రవ్వించాడు. దిక్కులేనివారికి శరణాలయాలు కట్టించాడు. గోశాలలు, దేవాలయాలు, యజ్ఞాలు, యాగాలు ఎన్నెన్నో చేసాడు. అలా రెండేళ్లు గడిచాక ప్రభువు ఒకసారి గురుదర్శనానికి వెళ్లాడు. సాగిలపడి మ్రొక్కి, వినయంతో యిలా అడిగాడు -

"స్వామీ! తమరు చెప్పినట్లే ఎన్నెన్నో పుణ్యకార్యాలు చేస్తున్నాను. దానధర్మాలు మాత్రమేగాక ప్రజోపయోగకరమైన పనులెన్నో చేస్తున్నాను. అయినా నాకు భగవద్దర్శనం కానేలేదు. ఆయన కృప ఎందుకు కలగలేదు స్వామీ?" అతడలా దీనంగా అడగ్గానే గురువు చిరునవ్వు నవ్వాడు.

"నాయనా! వర్షం బాగా కురవాలంటే మబ్బులకు చల్లనిగాలి తగలాలి. అలా తగలాలంటే నేలపైన పచ్చని వృక్షాలతో ప్రకృతి నిండి ఉండాలి. వానలు బాగా కురవాలంటే చెట్లు బాగా పెంచక తప్పనట్లే-పరమాత్మ కృపాదృష్టి మనపై కురవాలంటే మన సత్కార్యవనాలు బాగా పెరగాలి. నీవు నీ రాజ్యం పెంచుకోవటం కోసం, పరిపాలన కోసం ఎంతో కష్టపడతావు గదా!





నశించిపోయే సంపద కోసమే అంత శ్రమించినపుడు-శాశ్వతమైన పరమాత్మ కోసం మరెంత కష్టపడాలో ఆలోచించు. నిరాశచెందకుండా నీ కృషిని కొనసాగించు" అన్నారు.

ప్రభువు తిరిగివెళ్ళాడు. తీర్థక్షేత్ర సందర్శనం, పూజాదికాలు పెంచు కున్నాడు. దానధర్మాలు, అనాథలకు వివాహాలు ... యివీ, అవీ అని లేదు - సత్కార్యాలనిపించినవన్నీ చేస్తున్నాడు. అలాఅలా మరో రెండేళ్లు గడిచి పోయినాయి. రాజుకు భగవత్ప్రాప్తి కలగనే లేదు. ఆయన నిరంతరం భగవన్నామం స్మరిస్తూనే ఉన్నాడు. అయినా స్వామికి దయకలగనే లేదని రాజు చింతామగ్నుడైనాడు. తన గురువు అసత్యం చెప్పరు. భగవానుడు ఎటూ కరుణాళుడే. మరి, లోపమెక్కడ? ఆయన నోటివెంట "కరుణా లయా, నీకింత కాఠిన్యమెటులబ్బె?" అన్న మాటలు కీర్తనగా వెలువడ్డాయి. తీవ్రతపనతో అల్లాడి అల్లాడి ఎప్పటికో కనులు మూసుకొన్నాడు రాజు. రెండుజాములు గడిచిపోయాయి.

హఠాత్తుగా ప్రభువుకు మెలకువ వచ్చింది. ఎవరీ నిశీథివేళ ఏడుస్తు న్నది? జాగ్రత్తగా విన్నాడు రాజు. స్త్రీ ఏడుపా? తన రాజ్యంలో స్త్రీకి అవమానం జరిగే వీలేలేదే! తమ తండ్రిగారి కాలం నుండే స్త్రీసన్మాన్యవస్తువేగానీ- కేవల భోగ్యవస్తువు కాదన్న భావం రాజ్యంలో స్థిరపడి ఉంది. మరింత జాగ్రత్తగా విన్నాడు ప్రభువు. అది స్త్రీ కంఠం కాదు-ఎవరో చిన్న పిల్లవాడి గొంతు. మొండిగా, గట్టిగా ఏడుస్తున్నాడు వాడు. ఎటువైపు నుంచీ వస్తున్నది ఆ ధ్వని? చెవి ఒగ్గి గ్రహించాడు ప్రభువు. లేచి, గవాక్షం దాకా వెళ్లి సేవకులను పిలిచాడు. నిర్నిద్రంగా ప్రభు శయ్యాగారాన్ని కాపలా కాస్తున్న సేవకులిద్దరు పరుగున వచ్చారు. రాజాజ్ఞపై ఆ ఏడుస్తున్న పిల్లవాడిని తీసుకు రావటంకోసం నగరంలోకి పరుగుతీసారు. మరొక్క అరఘడియలో ఐదేళ్ల పిల్లవాడిని, ఒక వితంతు నిరుపేద స్త్రీని తెచ్చి ప్రభువుముందు నిలబెట్టారు.

పిల్లవాడింకా ఏడుస్తూనే ఉన్నాడు. తల్లి వాడి నోటి మీద చెయ్యిపెట్టి నొక్కే ప్రయత్నం చేస్తున్నది. కానీ వాడే మాత్రమూ లెక్కచెయ్యటం లేదు.

ఆమె చెయ్యి నెట్టి పారేసి "వాఁ! అని ఏడుస్తూనే ఉన్నాడు.

"ఏమిటమ్మా, వీడి బాధ? ఎందుకీ ఏడుపు"? ప్రశ్నించాడు ప్రభువు. వితంతు స్త్రీ రాజపాదాల ముందు మోకరించి నమస్కరించింది. లేచి తన కొడుకుకు కొంగు కప్పి దగ్గరకు లాక్కొంటూ "క్షమించండి మహారాజా! వీడు మొండివాడు. కానీ పసివాడు క్షమించండి" అన్నది భయంతో వణుకుతూ. రాజు చిరునవ్వు నవ్వాడు. "ఫర్వాలేదమ్మా! నాకేం కోపం లేదులే! ఎందుకు ఏడుస్తున్నాడో చెప్పు" అన్నాడు.

"స్వామీ నేను పేదరాలిని. ఇవాళ పొద్దున ధనవంతుల ఇంటిలో జరుగుతున్న ఒక ఉత్సవంలో పనిచేయటానికి వెళ్ళాను. ఆ ఇంటివారి అబ్బాయిది పుట్టినరోజు. అందుచేత అనేకమంది బంధుమిత్రులు వచ్చారు. ఆ పిల్లవాడికి రకరకాల బొమ్మలు తెచ్చారు. అవన్నీ చూచి వీడు తనకు కూడా అలాంటివి కావాలని అడిగాడు. ఇంటికివెళ్ళాక కొని ఇస్తానని చెప్పి అప్పటికి ఆపగలిగాను. వీడు అక్కడ భోజనమైనా చేయలేదు. ఇంటికి వస్తుండగా దారిలోనే "బొమ్మలు కొంటానన్నావుగా? కొను" అని మొదలు పెట్టాడు. ఎలాగో సముదాయించి నా గుడిసెదాకా తీసుకువచ్చాను. ఇక పెద్దఎత్తున ఏడుపు మొదలుపెట్టాడు. మెతుకు ముట్టకుండానే ఏడ్చిఏడ్చి నిద్రపోయాడు. ఓ గడియ క్రితమే మెలకువ వచ్చింది. ఇంకేముంది అందుకున్నాడు రాగాలాపన. వీడి ఏడుపు తమకు నిద్రాభంగం కలిగించింది. ప్రభువులు పెద్ద మనసుతో క్షమించాలి" అని చేతులు జోడించి నమస్కరించింది ఆ పేద తల్లి.

మహారాజు ఆ పిల్లవాడిని చూచి, "ఇక చాలులే! రేపు నేను చాలా బొమ్మలు తెప్పిస్తాను. ఏడుపు ఆపేయి" అన్నారు. సేవకులతో మంచి మిఠాయిలు, పండ్లు, పాలు తెప్పించి ఇచ్చి "ముందు ఇవి తిను అన్నారు. పిల్లవాడు వాటిని ముట్టలేదు సరికదా ముఖం తిప్పకొని ఇంకా పెద్దగా ఏడవసాగాడు. తల్లి బ్రతిమాలింది లాభం లేదు. రాజు కోప్పడిచూచాడు. ఏడ్పు ఆగలేదు. రాజుకు వాడి మొండితనం చూస్తే నవ్వు వస్తున్నది. తల్లికి భయం వేస్తున్నది. సేవకులకు కోపం వస్తున్నది. రాజు నవ్వి, సేవకులవైపు





తిరిగి, "వెళ్ళండి, వెళ్ళి చందనశ్రేష్ఠి దుకాణం తెరిపించి మంచి బొమ్మలు పదిరకాలు తెండి, త్వరగా రండి" అని ఆజ్ఞాపించాడు. ఈ మాటలు వింటూనే పిల్లవాడి ఏడ్పుస్థాయి తగ్గింది. సేవకులు వెళ్ళిన వైపు చూస్తూ, మధ్యమధ్య ఒక రాగం తీస్తూ కూర్చున్నాడు. తల్లి ఒక మిఠాయి ముక్క తినిపించబోయింది. వాడు పళ్ళు గిట్ట గరచుకొని ముక్క లోపలకు పోనివ్వనే లేదు. రాజు వాడివైపు చూస్తూ కూర్చున్నాడు.

మరికొద్దిసేపట్లో సేవకులు వచ్చారు-చేతుల నిండా బొమ్మలతో. పిల్లవాడు చటుక్కున లేచి నుంచున్నాడు. తల్లి వారిస్తున్నా వినకుండా బొమ్మల దగ్గరకు వెళ్ళి చూడసాగాడు. రాజు చిరునవ్వుతో "తీసుకో-ఇవన్నీ నీకే" అనగానే చటుక్కున తన చేతులు చాపి వాటినన్నిటినీ పొట్టకూ, గుండెకూ ఆనించుకొని మోసుకొంటూ తల్లి దగ్గరకు వచ్చాడు. తల్లి కన్నీళ్లతో ప్రభువుకు నమస్కరించింది. పిల్లవాడు బొమ్మలన్నీ తల్లి దగ్గర పెట్టి, మిఠాయి పళ్లెం పని పట్టసాగాడు. రాజు సేవకులవైపు చూచాడు. "వీళ్లను జాగ్రత్తగా యింటి దగ్గర దింపి రండి. రేపటి నుండీ వీళ్లకు మంచి ఇల్లు ఏర్పాటు చేయించండి. ఏ లోటూ రానివ్వకుండా చూడమని నగరాధికారికి మా మాటగా చెప్పండి" అన్నాడు. పిల్లవాడు వెడుతూ వెడుతూ రాజువైపు చూచి నోరంతా విప్పి నవ్వాడు. ఆయనకెందుకో మనసంతా సంతోషంతో నిండిపోయింది. వెళ్లి పక్కమీద పడుకొన్నాడేగానీ వాడి నవ్వే కళ్లల్లో నిలిచిపోయింది. తనకు భగవత్ప్రాప్తి ఎందుకిన్నాళ్లూ కలగలేదో ఆయనకిప్పుడు అర్థమవుతున్నట్లనిపించింది. ఆ చిన్న పిల్లవాడిలో బొమ్మలకోసం ఉన్నంత తపన తనలో లేదు. వాడు ఆకలిని లెక్కచెయ్యలేదు. తల్లి మందలింపును సరకు చెయ్యలేదు. బుజ్జగింపుకు కరిగిపోలేదు. చివరికి రాజైన తన కోపాన్ని కూడా లక్ష్యపెట్టలేదు. వాడు కోరుకొన్న బొమ్మలు దొరికిన తరువాతనే శాంతపడ్డాడు. ఏదీ తనకా తపన! రాజ్య వ్యవహారాలు, గృహ సమస్యలు, ప్రజా వ్యవహారాలు-వీటన్నిటికీ పోగా మిగిలిన కాస్త సమయాన్ని మాత్రమే భగవద్ధ్యానానికి ఉపయోగిస్తున్నాడు.

అది కూడా కార్యవ్యగ్రత ఉంటే మరికొంత తగ్గుతుంది. అవును-తాను పసిబిడ్డకున్న మొండిదీక్షతో లేడు. లౌకిక వ్యవహారాలకు అతీతంగా లేడు. అందుకే స్వామికి తన మీద దయ కలగలేదు. ప్రభువుకు కనులనిండా నీరు తిరిగింది. అలా ఆలోచిస్తూనే .... నిదురలోకి జారిపోయాడు ప్రభువు.

వేకువ జాము కాబోతున్నది. కలత నిదురలో ఉన్నాడు రాజు. ఎక్కడి నుంచో అత్యద్భుతమైన చందన పరిమళం-సన్నని వేణుగానం-మెల్లని మెత్తని అడుగుల సవ్వడి ... ఎవరిది? ప్రభువు ఉలికిపడ్డాడు. ఎవరది! తన దైవం-తన ప్రేమ నిధానం శ్రీ కృష్ణ భగవానుడే. దయా పారావతాల లాంటి కళ్లలోంచీ దూకే కరుణ పలకరిస్తున్నట్లు అరవిచ్చుకొంటున్న పెదవులు-ముఖ్యంగా ఆ చిరునవ్వు ... ఇందాకటి పిల్లవాడి పెదవులపై విరిసినటువంటి నిర్మల స్నేహనిధి వంటి, జాజిరెక్కలు రాలుతున్నట్లనిపించే ఆ నవ్వు ..... ప్రభువు అప్రయత్నంగా చేతులు జోడించాడు. అతి ప్రయత్నం మీద "స్వామీ!" అనగలిగాడు. చివరికి కూడగట్టుకొని, "ఇన్నాళ్లకు దయ తలచావా ప్రభూ!" అన్నాడు.

స్వామి నవ్వాడు. అదే నవ్వు-పంచమినాటి వెన్నెలలు అలవోకగా పరుచుకొంటున్నట్లు. ప్రభువు మైమరచి చూస్తున్నాడు ఆయనవైపు. స్వామి పెదవి విప్పాడు. అమృత ప్రవాహం ముంచెత్తుతున్నట్లు మెత్తని పలుకులు- "భక్తా, ఇన్నేళ్లుగా నీవు చేస్తున్న సత్కార్యాలన్నింటి వెనుక ఒక కామన, ఒక లక్ష్యం ఉన్నాయి. నీ గుర్వాజ్ఞ ప్రకారం చేసినవి అవి. నన్ను చూడాలన్న ఆశతో చేసినవి. రాత్రి నీవు నా కోసం తపిస్తూ నిద్రబోయావు. ప్రేమార్ద్రత, తపన ఉన్నచోటే మనసు మెత్తబడుతుంది. నన్ను ప్రేమించటం అంటే ప్రపంచాన్ని ప్రేమించటమే. నీకు పిల్లవాడి ఏడుపు నిద్రాభంగం చేసినందుకు కోపం రాలేదు. వేదన కలిగింది. జాలి కలిగింది. అతడి బాధేమిటో కనుక్కొని తీర్చాలనిపించింది. అతడి మొండితనం నీలో ఆలోచన కలిగించింది. వాడి కోరిక తీరినప్పడు వాడు సంతోషంతో నవ్విన నవ్వు నీలో తృప్తి నింపింది. ఇదంతా ఎందుకు చేసావు! కేవలం





ప్రేమతో, దయతో. ఏ ప్రతిఫలం ఆశించకుండా నీవు చేసిన యీ పనే అచ్ఛమైన సేవ. అందుకే నీకు దర్శనమివ్వాలనుకొన్నాను. నాయనా, ప్రేమే నేను-నేనే ప్రేమ. ప్రేమ నిండిన ఏ చిన్న పనయినా నన్ను చలింపజేస్తుంది. సాటి జీవులను ప్రేమించలేని రసహీన హృదయాలలోకి నేను రాలేను. ఇలాగే కరుణార్ద్రతతో జీవించు" పరమప్రభువు పాదాలంటి నమస్కరించాడు ప్రభువు కన్నీళ్లతో మరొక్కసారి. తన చిరునవ్వు వెలుగులతో ఆ గదిని తేజోమయం చేస్తూ అంతర్థానమైపోయాడు. స్వామి ప్రభువు ఉలిక్కి పడి కళ్లు తెరిచాడు. గదిలో చందన పరిమళం-యింకా చెదరని కాంతి. అది కల కాదు-నిజమే. తనకు దైవ సాక్షాత్కారం కలిగింది. ప్రభువు పరమానందంతో తన గురువు చెంతకు బయలుదేరాడు-యీ విషయం విన్నవించుకోవడానికి.

## స్వరాంజలి

*'రామకృష్ణ కథామృతం' నుండి*

*చాలునే నీ నిద్ర చాలునే మనసా*
*ఇక ఎంతకాలము నిదురపోయెదవే* // చా //
*మాయకౌగిలిలోన మగతలో చిక్కి*
*కనుమూసి ఎన్నాళ్లు కులుకుచుండెదవే* // చా //
*ఏలపుట్టితివీవు - ఎవరవే నీవు?*
*నీ రూపమసలేమొ మరచిపోయితివి*
*నీ కనులు విప్పవే యికనైనా మనసా*
*కలల భ్రాంతిని వీడి మేలుకొనవే* // చా //
*నీ యందె నిత్యమౌ ఆనందముండ*
*తరలిపోయెదు బయటి తళుకులకు భ్రమసి*
*బుద్ధి విడనాడి నీవు బద్ధవైనావు*
*వెడలి చీకటి నుండి వెలికిరావేమె* // చా //

# సాయితో తర్ఖడ్ స్మృతులు - 5

**- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్**

**(గత సంచిక తరువాయి)**

ప్రియ సాయి బంధు పాఠకులారా!

మీరు ఒక్కసారయినా షిరిడీకి వెళ్ళి ఉంటారని అనుకుంటున్నాను. ఇప్పటి షిరిడీకి, ఇంతకుముందు సంవత్సరాలలో మా నాన్నగారు వెడుతూండేటప్పటి షిరిడీలో చాలామార్పు వచ్చింది. మీరు షిరిడీలో ప్రవేశించడానికి కోపర్గాఁవ్ పొలిమేరకు వచ్చినప్పడు అక్కడ ఒక వాగు ఉంటుంది. షిరిడీ గ్రామంలోకి రావాలంటే ఆ వాగును దాటాలి. సంవత్సరంలో ఎక్కువసార్లు వాగు ఎండిపోయి ఉంటుంది. వర్షాకాలంలో మాత్రమే వాగు వేగంగా ప్రవహిస్తూ ఉండటం చూడవచ్చు. ఇప్పడు ప్రధాన రహదారికి దానిమీద చిన్న వంతెన ఉంది. ఆ రోజులలో గ్రామస్తులు ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకోవడానికి యీ వాగు ఒడ్డుకు వస్తూ ఉండేవారు. అక్కడ చాలా పొదలు ఉండటంతో సూర్యోదయానికి ముందు ఆ ప్రదేశం గ్రామస్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి అనువుగా ఉండేది. రోడ్డు మీద జన సంచారం కూడా ఉండేది కాదు. మా నాన్నగారు షిరిడీలో ఉన్నప్పడు వర్షాకాలం రోజులు. ఆయన స్నానాదికాల తరువాత కాకడ ఆరతికి వెళ్ళేవారు. అటువంటి రోజులలో ఒకనాడు ఆయన వేకువజామునే లేచి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాగు ఒడ్డుకు వెళ్ళారు. అప్పడు బాగా ముసురుపట్టి జడివాన కురుస్తూండటంతో తనతో కూడా గొడుగు, టార్చ్ లైటు తీసుకుని వెళ్ళారు. ఈ విధంగా ఆయన ఆ పరిస్థితిలో ఉండగా వాగు ఒడ్డున అవతలివైపునుంచి ఎవరో గట్టిగా అరుస్తూ ఉండటం విన పడింది, ముందర ఆయన ఆ అరుపులను పట్టించుకోలేదు. ఆ వ్యక్తి





ఎక్కడున్నాడో చూద్దామని ప్రయత్నించారుగాని చీకటిగా ఉండటం వల్ల ఎవరూ కనపడలేదు. ఆ మనిషి ఒడ్డు దగ్గర నుంచి పరుగెత్తుకుని వెళ్ళిపొమ్మని అరుస్తున్నట్లుగా అర్థమయింది. అతను "మరాఠీలో "లోంఢా అలారే అలాపాలా" అని అరుస్తున్నాడు. మా నాన్నగారికి లోంఢా అంటే దాని అర్థం తెలీలేదు. (కెరటం), ఆయన విద్యాభ్యాసం ఆంగ్ల మాధ్యమంలో జరిగింది, కాబట్టి వాడుక భాషలో మాట్లాడే మరాఠీ భాషని అర్థం చేసుకోవడానికి ఆయనకు కష్టమయింది. ఏమయినప్పటికి ఆ మనిషి అక్కడున్న వారనందరినీ ఆ ప్రదేశం వదిలి పరిగెత్తుకొని వెళ్ళిపొమ్మని హెచ్చరిస్తున్నట్లు తెలుసుకోగలిగారు. ఆయన హడావుడిగా కాలకృత్యాలను ముగించుకొని పైకి లేచి నుంచుని, చుట్టూ ఏమి జరుగుతుందో చూద్దామని టార్చ్‌లైట్ వేశారు. 15, 20 అడుగుల ఎత్తులో నల్లటి రంగులో నీరు తనవైపుకు వస్తూ ఉండటం కనపడింది. రాత్రి సమయంలో ఎక్కడో విపరీతమైన కుండపోత వర్షం వచ్చి దాని కారణంగా వాగులో హఠాత్తుగా వరద వచ్చింది. తనకు చావు దగ్గరబడిందని ఆయనకు అర్థమయి గట్టిగా "బాబా మేలో మాలా ప‌ఛావా" అని అరిచారు. (బాబా నేను చనిపోతున్నాను దయచేసి నన్ను రక్షించు) ఆయన కళ్ళు మూసుకొని అక్కడే ఆ సమయమంతా బాబా నామస్మరణ చేస్తూ అదేచోట నుంచుని ఉన్నారు. కొంతసేపటి తరువాత తాను కొట్టుకొని వెళ్ళిపోలేదనీ, బతికే ఉన్నాననీ అర్థమయింది. ఆయన కళ్ళు తెరిచి చూచి తన కళ్లను తానే నమ్మలేకపోయారు. నీటి ప్రవాహం రెండు పాయలుగా విడిపోయి తనని తాకకుండా తన ముందునుంచి వేగంగా వెడుతోంది. ఆయన యింకా ఆ నీటి ప్రవాహంలోనే ఉన్నారు. ఆయనకు చావు భయం పట్టుకుంది. ఆ సమయమంతా ఆగకుండా బాబా నామస్మరణ చేస్తూనే ఉన్నారు, కొంతసేపటి తరువాత నీటిమట్టం తగ్గింది, అది మోకాలు లోతుకు వచ్చేటప్పటికి నీరు ఆయన శరీరాన్ని తాకింది. ఇప్పడాయన మోకాలిలోతు నీటిలో

ఉన్నారు, ప్రవహించే వరద నీటిలో తన చుట్టూరా చెట్ల కొమ్మలు, పొదలు, జంతుజాలాలు వగైరా కొట్టుకొని పోవడం చూసారు. అక్కడికక్కడే ఆయన బాబాకు ధన్యవాదాలు తెలిపి, అటువంటి చావు పరిస్థితి నుంచి బాబాయే కాపాడారని అర్థం చేసుకున్నారు, అప్పుడాయన మెల్లగా ఆ మోకాలిలోతు నీటిలో వెనుకకు నడిచారు, ఆయన తమ బస వద్దకు వచ్చి, స్నానం చేసారు. ఆ ఉదయం ఆయన కాకడ ఆరతిని చూసే అదృష్టాన్ని పోగొట్టుకున్నారని వేరే చెప్పనక్కరలేదు, ఆ ఉదయం జరిగినదంతా తన తల్లికి చెప్పారు. ఆయనను మృత్యుకోరల నుంచి బాబాయేలాగారనీ, తనకు ప్రాణభిక్ష పెట్టినందుకు వెంటనే వెళ్ళి ఆయనకు ధన్యవాదాలు తెలుపమనీ ఆవిడ సలహా ఇచ్చింది. ఆయనను వెంటనే ద్వారకామాయికి వెళ్ళి తనకు చేతిలో పూజాసామాగ్రితో మెట్లు ఎక్కుతుండగా బాబా రెట్టించిన స్వరంతో "ఏయ్ భావూ! యివాళ పొద్దున్నే నా సహాయం కోసం ఎందుకు అరిచావు? చనిపోతావని భయం వేసిందా?" అన్నారు. మా నాన్నగారు ఆయన కాళ్ళమీద పడి బాబాతో "మీకంతా తెలుసు, నాలాంటి సామాన్య మానవుడు చావు తథ్యమని కళ్ళెదుట కనపడుతూ ఉంటే భయపడటం సహజం" అన్నారు. బాబా ఆయనను భుజాలు పట్టుకుని లేవనెత్తి "ఏయ్ భావూ, పైకిలే. నేను నిన్ను చావడానికి షిరిడీ తీసుకురాలేదు" అన్నారు. ఇంకా "గుర్తుంచుకో. నువ్వింత సులభంగా యీ విధంగా చావవు. భవిష్యత్తులో నువ్వు చేయవలసిన పని ఎంతో ఉంది" అన్నారు.

---

## అనాదిగా ఈ గడ్డపైని బోధలు-1

**(32వ పేజీ తరువాయి)**

8. "ఆప్నుహి శ్రేయాంసమితి సమంక్రామ" (అధర్వవేదం)
   -"నీకన్నా శ్రేష్ఠులైన వారిని చేరుకో. నీ సమానులకన్నా కాస్త ముందుకు నడువు".
9. "అర్చన్నను స్వరాజ్యమ్" (సామవేదం)
   - "నీవు స్వరాజ్యాన్ని (అనుభవించటమే కాదు) పూజించు, అర్చించు".





# అనాదిగా ఈ గడ్డపైని బోధలు-1

సేకరణ : **అరవింద**

1. "సంగచ్ఛధ్వం, సంవదధ్వం, సంనో మనాంసి జానతామ్"-ఋగ్వేదం
   - "అందరూ కలిసి నడవాలి. కలసి ఆలోచించాలి. మనసులన్నీ ఒకే తీరైన జ్ఞానవికాసం పొందాలి".
2. అనువ్రతః పితుః పుత్రో మాత్రాభవనుసం మనాః (అధర్వవేదం)-" కుమారులు తండ్రికి అనుకూలంగా మసలుకోవాలి-తల్లి హృదయ మెరిగి నడవాలి".
3. "మోఘమన్నం విందతే అప్రచేతాః సత్యం బ్రవీమి వధ ఇత్సతస్య (ఋగ్వేదం)
   - "సోమరివాడు ఏ శ్రమా పడకుండానే అన్నమూ, సుఖాలూ కోరు కొంటాడు" అలాటివాడు సర్వభ్రష్టుడవుతాడు. ఇది నిజం సుమా!"
4. "అక్షైర్మాదీవ్య, కృషిమిత్ కృషస్వ" (ఋగ్వేదం)
   - "జూదాలు (పందేలు, పాచికలు వగైరాలు) ఆడరాదు. వ్యవసాయ దారుడిలాగా కష్టించి పనిచేయాలి".
5. "మా గృధః కస్యస్విద్ధనమ్ (యజుర్వేదం, ఈశావాస్యోపనిషత్)
   - "ఎవరి ధనాన్నీ ఆశించబోకు".
6. "శత సహస్ర హస్త సమాహర, సహస్ర హస్త సంకిర" (అధర్వవేదం)
   -"ధర్మమార్గంలో వేయి చేతులతో ఆర్జించు, వేయి చేతులతో పంచిపెట్టు".
7. "అసద్ భూమ్యా సమభవత్ తద్యామేతి మహద్ వ్యచః"(అధర్వవేదం)
   -"పాపం మానవునిలో పుడుతుంది భూమి మీద. అంతదూరం వెళ్ళినాగానీ తప్పకుండా తిరిగి వచ్చి ఆ పాపం ప్రారంభించిన వ్యక్తి దగ్గరకే వచ్చి చేరుతుంది. అతనికి దుఃఖాన్నే కలుగజేస్తుంది.

**(మిగతా 31వ పేజీలో)**